క్లుప్తంగా

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ



ఇబ్రహీంపట్నం: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై మండల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ జరిగింది. స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నుంచి రింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దాడులను నివారించడంలో ఆ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని బీఎస్పీ ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్ అన్నారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ప్రేమదాస్, వందనం దాసు, బిక్షంరాజు, కుక్కమళ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమాల్లో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను స్పందనలో అందజేస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లను ఎస్సై నంబూరి చంటిబాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో నిర్వహించే ఉప ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా ప్రాంతాల్లోని రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులను, ఎన్నికల నేరాలకు పాల్పడిన వారిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్సై కోరారు.

తల్లిపై కుమారుడి దాడి

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని కొమ్మూరుకు చెందిన పోట్రు కోటేశ్వరమ్మ భర్త వెంకటేశ్వరరావు పదేళ్ల క్రితం చనిపోయాడు. ఆమె ఆస్తి పత్రాలు మనవడు తీసుకెళ్లాడు. వాటి కోసం ఈ నెల 6వ తేదీన వారి ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో పెద్ద కుమారుడు ఏడుకొండలు, కోడలు దుర్గ, మనవడు పవన్ కలిసి దాడిచేయడంతో కోటేశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి నుంచి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తావిర్యా నాయక్ తెలిపారు. ఎస్సై చంటిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు గొల్లపూడి పంచాయతీ ఆఫీస్ ఏరియా, దేవినేని స్ట్రీట్ ఏరియా, గంగానమ్మ టెంపుల్ ఏరియా, ఏఆర్ కన్‌స్ట్రక్షన్ అపార్ట్‌మెంట్ ఏరియా, వేణుగోపాల స్వామి టెంపుల్ ఏరియాలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని సుధాకర్ కోరారు.

కోడిపందేల శిబిరంపై దాడులు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామ మామిడితోటలో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు ఆదివారం దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.40 వేలు, 15 ద్విచక్రవాహనాలు, ఆరు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: లోపూడిలో పేకాట శిబిరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.కుటుంబరావు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను సోమవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు

- నాడు–నేడు నిధులతో పనులు
- ఆధునిక ఫర్నీచర్ మంజూరు
- పెరుగుతున్న అడ్మిషన్లు



గంపలగూడెంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

తిరువూరు: నిన్న మొన్నటి వరకు పూరిపాకల్లో, అద్దె ఇళ్లల్లో కొనసాగిన అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు నిధులతో పక్కా భవనాలు సమకూరుతున్నాయి. తిరువూరు నియోజకవర్గంలో తొలి విడత నాడు–నేడు పథకం కింద 15 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. రెండో విడత మరో 15 భవనాలను కేటాయించనున్నారు. ఒక్కొక్క భవనానికి రూ.15లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. తిరువూరు ప్రాజెక్టు పరిధిలో విస్సన్నపేట, ఏకొండూరు, గంపలగూడెం, తిరువూరు మండలాలుండగా, మొత్తం 255 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. వీటిలో సుమారు ఏడు వేల మందికి పైగా చిన్నారులు ప్రీస్కూల్ అడ్మిషన్లు పొందారు.

పక్కాభవనాలు చకచకా..

ఏకొండూరు మండలంలోని ఏకొండూరు మెయిన్, గోపాలపురం, కంభంపాడు–2, పాత కొండూరు, రేపూడి ఎస్సీ, గంపలగూడెం మండలంలోని అమ్మిరెడ్డిగూడెం, గాదెవారిగూడెం, గంపలగూడెం, పెనుగొలను–4, విస్సన్నపేట మండలంలోని ములగలపాటివారిగూడెం, విస్సన్నపేట నాడేటివారివీధి, తెల్లదేవరపల్లి, చంద్రుపట్ల చినతండా, నరసాపురం మెయిన్, పీబీ గూడెంలలో అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. వివిధ దశల్లో వీటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రూ.12.50 లక్షలతో భవన నిర్మాణం, రూ.2.50 లక్షలతో ఆటపరికరాలు, ఫర్నీచర్ సమకూరుస్తారు.

అన్ని కేంద్రాలకూ పక్కా భవనాలు

అంగన్‌వాడీ కేంద్రాలన్నిటికీ పక్కా భవనాలు నిర్మించే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాచరణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా నాడు–నేడు నిధులతో ఈ కేంద్రాల నిర్మాణం జరుపుతోంది. తొలివిడత 15, రెండో విడత మరో 15 కేంద్రాలకు పక్కా భవనాలు సమకూరుతాయి. ఆధునిక ఫర్నీచర్ కూడా మంజూరైంది.



– సత్యవతి, సీడీపీఓ, తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు

దోషరహిత ఓటర్ల బాబితా తయారీ లక్ష్యం

నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్

ముసునూరు: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కే కీలకమని, దోషరహితంగా ఓటర్ల జాబితా తయారీ లక్ష్యంగా కృషి చేస్తున్నామని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ అన్నారు. ఓటర్ల వివరాలు తప్పులు లేకుంగా జాబితాలు రూపొందేలా బీఎల్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. మండల వ్యాప్తంగా తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ, ఆధార్‌లింక్ తదితర ప్రక్రియలను ఆయన ఆదివారం పరిశీలించారు. ముసునూరు, రమణక్కపేట, చిల్లబోయినపల్లిల్లో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్వేను సబ్ కలెక్టర్ పరిశీలించారు. చిల్లబోయినపల్లిలోని 107, 108 పోలింగ్ బూత్‌ల సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు డివిజన్ వ్యాప్తంగా ఓటర్ల సంబంధిత వివరాల సవరణ కార్యక్రమం చేపట్టామని, ప్రతి ఇంటికీ వెళ్లి తప్పులను సరిజేస్తున్నట్టు తెలిపారు. బీఎల్వోలు అన్ని వివరాలను సమగ్రంగా, సక్రమంగా సేకరించాలని సూచించారు. సక్రమంగా నమోదుకాని ఓట్లపై దృష్టి పెట్టి జాగ్రత్త వహించాలని ఆధార్ వివరాల ద్వారా సరిచేయాలని సూచించారు. కార్యక్రమాల్లో డీటీ ఎమిలీ కుమారి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, సీనియర్ సహాయకులు సగ్గుర్తి శ్రీనివాసరావు, రవీంద్రరెడ్డి, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.



బీఎల్వోలకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్

ప్రభుత్వ పథకాలపై ప్రచారం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రిలీఫ్ సొసైటీ అధ్యక్షుడు మేచర్ల రవీంద్ర, ఆయన సతీమణి మేరి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై కొండపల్లిలో మాటామంచి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో పాలకులు 600కు పైగా హామీలు ఇచ్చి అమలు చేయలేక పోయారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు 98శాతం మాటతప్పకుండా అమలు చేసిన ఘనత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వంపై కృతజ్ఞత కలిగి ఉండాలన్నారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్ల నిర్మాణం పరిశీలన

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు షేక్ మస్తాన్‌వలీ, రంగబాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని అంతర్గత రహదారులన్నింటినీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాల మేరకు గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ రోడ్లలో ప్రజలు గృహావసరాలకు వాడిన మురుగునీటిని బయటకు పంపించేందుకు కచ్చా డ్రెయిన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు.



నిర్మిస్తున్న రోడ్లను పరిశీలిస్తున్న మురళీకృష్ణ, రాము

భక్తిశ్రద్ధలతో నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాత శివాలయంలో కొలువై ఉన్న నందీశ్వరునికి త్రయోదశిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి నెలా బహుళ త్రయోదశిని ప్రదోష కాలంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పంచహారతులను నిర్వహించి నందీశ్వరునికి నూతన వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగరాజు పర్యవేక్షించారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో పెరిగిన భక్తుల తాకిడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండో శనివారం, ఆదివారంతో పాటు మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వరుస సెలవుల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో పాటు ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు సైతం ఉభయదాతలు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో ఖడ్గమాలార్చనతో పాటు లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ

లోక కల్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్యూలను పర్యవేక్షించిన చైర్మన్, ఈఈ

భక్తుల రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. రూ.100 క్యూలైన్‌లో భక్తులు అధికంగా ఉండటంతో వారికి రూ. 300 క్యూలైన్‌లోకి మళ్లించి రెండు క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేస్తున్న ఉచిత ప్రసాదంతో పాటు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు, భక్తులు, పలువురు ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు.



ఆదిదంపతుల ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



క్యూలో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట ఫోర్‌మెన్ బంగ్లా ప్రాంతానికి చెందిన బి.దుర్గా భవానీ, శ్యామ్‌కుమార్ భార్యాభర్తలు. వీరికి 16 ఏళ్ల కిందట వివాహం కాగా, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. శ్యామ్‌కుమార్ గతంలో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేసేవాడు. కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగి వేధింపులకు గురి చేయసాగాడు. దుర్గాభవానీ 10 నెలల కిందట చిట్టినగర్ సెంటర్‌లో ల్యాబ్‌ను పెట్టి నడుపుతుంది. అందులో వచ్చిన డబ్బులు కూడా తనకు ఇవ్వాలని శ్యామ్ రోజూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో చిన్నారుల ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కంకిపాడులోని ఓ కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత విశ్లేషణ(అబాకస్, బ్రెయిన్‌జిమ్) పోటీల్లో నగర చిన్నారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 900 మంది చిన్నారులు పాల్గొనగా లబ్బీపేటలోని సిప్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఆ పోటీల్లో అసాధారణ ప్రతిభను కనపరిచి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన చిన్నారులకు ఆదివారం లబ్బీపేటలోని సిప్ అకాడమీలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిప్ అకాడమీ ఇండియా రీజినల్ మేనేజర్ ప్రవీణ్, స్టేట్ హెడ్ ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ.. చిన్నారులే దేశానికి అసలు సిసలైన వనరులని, వారిలో మేధాశక్తికి పదును పెట్టేందుకు అబాకస్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బీడీఓ షన్ముకీ, సెంటర్ మేనేజర్ ప్రేమలత, టీచర్స్ జాహ్నవి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



అబాకస్‌లో చిన్నారులతో సిప్ అకాడమీ ప్రతినిధులు

రేపు చిత్రలేఖనం పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గుండు దిలీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూరిభాయిపేటలోని నవోదయ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలిచిన విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లతో పాటు విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 82475 00651 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు పోటీలు

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాలు, నృత్య పోటీలు నిర్వహించారు. తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పద్మావతి, జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శారదా భాను పర్యవేక్షించారు. ఈ నెల 15న విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి తెలిపారు.

దేశభక్తిని పెంపొందించే ప్రతిజ్ఞ

తిరువూరు: స్వాతంత్య్రోద్యమ కాలంలో ప్రజల్లో దేశభక్తిని, సోదరభావాన్ని పెంపొందించేందుకు పైడిమర్రి వెంకట సుబ్బారావు రాసిన 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞ ఎంతో దోహదపడిందని తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక గ్రంథాలయ ఆవరణలో పైడిమర్రి వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రచయితలు, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే విధంగా పైడిమర్రి ప్రతిజ్ఞ రచించారని తిరువూరు రచయితల సంఘ కార్యదర్శి రేపాక రఘునందన్ పేర్కొన్నారు. ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎం.రాంప్రదీప్, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

పెనుగొలనులో పైడిమర్రికి నివాళి

పెనుగొలను(గంపలగూడెం): జాతీయ ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు వర్ధంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో ఆదివారం షిర్డీసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ భారతదేశం నామాతృభూమి ప్రతిజ్ఞ మన జాతి సమైక్యతను, సమగ్రతను చాటుతుందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. పైడిమర్రి అనేక పద్యకావ్యాలు, నాటకాలు, కథలు, నవలలు, అనువాద రచనలు చేశారన్నారు. సాయిబాబా సేవాకమిటీ సభ్యులు కృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



తిరువూరు గ్రంథాలయంలో పైడిమర్రి వర్ధంతి



పైడిమర్రికి నివాళులర్పిస్తున్న సేవాకమిటీ సభ్యులు

సంగమంలో వ్యూహం షూటింగ్ సందడి

ఇబ్రహీంపట్నం: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ నిర్మిస్తున్న వ్యూహం చిత్రం షూటింగ్ స్థానిక పవిత్ర సంగమం వద్ద ఆదివారం జరిగింది. చంద్రబాబు పాత్రధారుడు ధనుంజయ ప్రభుతో పాటు పలువురు జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో సందడి చేశారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు ప్రసంగంతో భక్తులు నిరీక్షించి తొక్కిసలాటలో మృతి చెందిన సంఘటన అసిస్టెంట్ డైరెక్టర్ చిత్రీకరించారు. మొత్తం రుణమాఫీ చేసి నిరూపిస్తా, ఉచిత విద్యుత్ అమలుచేస్తే కరెంట్ తీగలపైన బట్టలు ఆరేసుకోవాల్సిందే అని అప్పట్లో నోరు జారానని ధనుంజయప్రభు ప్రసంగం చిత్రీకరించారు. షూటింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ నాయకులతో కలసి సంగమం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పట్టిసీమ ప్రాజెక్ట్ నిర్మాణంలో చంద్రబాబు కష్టాన్ని కూడా చిత్రీకరించాలని డిమాండ్ చేశారు.



గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన సన్నివేశం

అమరవీరుల శిలాఫలకాల ఆవిష్కరణ

గంపలగూడెం: 'నాభూమి–నాదేశం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమరవీరుల శిలాఫలకాలను ఆదివారం ఆవిష్కరించారు. దుందిరాలపాడు, తునికిపాడు, ఉమ్మడదేవరపల్లి, గోసవీడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు దీపాలు వెలిగించి అమరవీరుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆజాదీకా అమృత మహోత్సవ ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి ఉమ్మడదేవపరల్లిలో మాట్లాడుతూ ''హర్ ఘర్‌కి తిరంగా జెండా'' కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు ప్రతి ఇంటివద్ద నిర్వహించాలని సూచించారు. దుందిరాలపాడులో స్వాతంత్య్ర సమరయోధురాలు కల్యాణం అనసూయమ్మను సన్మానించారు. సర్పంచ్‌లు బీ బాబూరావు, టీ వీరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రావమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.



దుందిరాలపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆంజనేయపురంలో..

తిరువూరురూరల్: మండలంలోని ఆంజనేయపురంలో ఆదివారం ఆజాదీ కా అమృతమహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, పంచాయతీ వార్డు సభ్యులు, విద్యార్థులు స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించారు. గ్రామ సచివాలయం, పాఠశాలల వద్ద మొక్కలు నాటారు.

డ్రైవర్లకు స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమం

నూజివీడు: భారీ వాహనాల డ్రైవర్ల నిద్రమత్తును వదిలించి ప్రమాదాలను నివారించేందుకు స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్సై రామకృష్ణ అన్నారు. మండలంలోని తుక్కులూరు బైపాస్ వద్ద ఆదివారం తెల్లవారుజామున రూరల్ సీఐ రాజులపాటి అంకబాబు, ఎస్సై టి.రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి లారీలను, ఇతర భారీ వాహనాలను నిలుపుదల చేసి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకుగాను ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు అతివేగంగా వాహనాలను నడపకుండా జాగ్రత్తగా నడపాలన్నారు. ఏమాత్రం నిద్ర వస్తున్నా తప్పనిసరిగా వాహనాలను నిలిపివేసి కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత బయలుదేరి వెళ్లాలన్నారు. ప్రతి వాహన డ్రైవరు వెనుక కుటుంబం ఉంటుందని, భార్యా పిల్లలను చూడాల్సిన బాధ్యత అతనిదే కాబట్టి ప్రమాదరహిత డ్రైవింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



తుక్కులూరు వద్ద స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రూరల్ సీఐ, ఎస్సైలు

బ్యాంకుల ప్రైవేటీకరణ యత్నాలను తిప్పికొట్టాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ యత్నాలను బ్యాంకు ఉద్యోగులు తిప్పికొట్టాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏఐబీఈఏ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అధ్యక్షుడు ఎస్.సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం బ్యాంకు ఉద్యోగుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటాచలం మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు చేసిన నిరంతర పోరాటాల ద్వారానే బ్యాంకులు ప్రభుత్వ రంగంలో కొనసాగుతూ ఉన్నాయన్నారు. బ్యాంకు ఉద్యోగులు 1991 నుంచి బ్యాంకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేరు వేరు సందర్భాల్లో 52 రోజులు దేశ వ్యాప్త సమ్మె చేశారని గుర్తు చేశారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ పదవిలో ఉండరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండే విధంగా చట్టాలు చేయాలని కోరారు. ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రవీంద్రనాథ్, బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ.. బ్యాంకుల జాతీయికరణ కారణంగా దేశం హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలివిప్లవం, పారిశ్రామిక విప్లవం సాధ్యమయ్యాయన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వెంకటేశ్వర నగర్ కాలువ గట్టు ప్రాంతానికి చెందిన ఎం.శివాజీ(21) డిగ్రీ పూర్తిచేసి సిమెంట్ పనులకు వెళ్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తల్లి అప్పలనరసమ్మ గుణదల పోలీసులను ఆశ్రయించారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.